# ముత్యపు గుండీలు

యెనిమిది సంవత్సరాల తర్వాత పుట్టింటికి బయలుదేరాను. అమ్మా నాన్న పోయినా స్వంత వూరిలో వ్యవసాయం చేసుకుంటూ సాదాసీదాగా బ్రతుకు సాగిస్తున్న తమ్ముడంటే నాకు ఎనలేని ప్రేమ.

శ్రీవారి వుద్యోగరీత్యా కలకత్తాలో వుండటంవల్ల తమ్ముడు ఎన్నిసార్లు రమ్మని వుత్తరాలు రాసినా రావటానికి వీలు కాలేదు.

'ఒక్కసారి తప్పక రా అక్కా' అన్న తమ్ముడి వుత్తరం నామనసుని లాగేసింది. అందుకే ఒంటరిగానే బయలుదేరాను. నా పుట్టిన వూరు విజయవాడ బందరు మధ్య వున్న ఓ పల్లెటూరు.

విజయవాడలో రైలు దిగేసరికి మేనల్లుడు మధు వెతుక్కుంటూ వచ్చాడు. యెన్నాళ్ళక్రితమో చూశాను యిప్పుడు పొడుగ్గా అందంగా నూనుగు మీసాలతో అచ్చంగా చిన్నప్పటి తమ్ముడి పోలికల్లో వున్నాడు.

'అత్తయ్యా' అంటూ వచ్చి పెట్టా బ్యాగూ తీసుకొని నడుస్తూ కబుర్లు చెప్పసాగాడు. నేను అడక్కుండానే చుట్టాల అందరి క్షేమ సమాచారం చెప్పేస్తూ 'నువ్వు యివన్నీ అడుగుతావని తెల్సు' అన్నాడు గడుసుగా. 'వూ తెలివి గలవాడివేరా' అన్నాను నవ్వుతూ బస్‌స్టాప్‌కి వచ్చి బందరు బస్ ఎక్కేశాం.

'అత్తయ్యా నీ పుట్టిన వూరు వచ్చేస్తోందోచ్' అరిచాడు మధు నా పుట్టిన వూరు పల్లెటూరే. అయినా నాకదంటే చాలా చాలా యిష్టం. ఆరు వేల జనాభా వున్న ఆ వూళ్లో అందరూ సామాన్య సంసారులే. నేను స్కూల్లో చదువుకుంటూ వుండగా మొట్టమొదటిసారి

యెవరిదో చిన్న కారు యెందుకో వచ్చింది. అంతే ఆ కారుని చూడటానికి ఆవూరు పిల్లలంతా విరగబడ్డారు. ఆకారు వెళ్ళిపోతుంటే దానివెంట కొంత దూరం పిల్లలు పరుగులు తీశారు. ఆ పిల్లలలో నేనూ వున్నాననే విషయం యిప్పటికీ గుర్తు వస్తూనే వుంటుంది. ఆ విషయం గుర్తు వచ్చినప్పుడల్లా యేదో తెలియని సంతోషంతో మనసు పులకరిస్తూనే వుంటుంది.

'అత్తయ్యా బస్ దిగూ' మధు అరిచినప్పుడుగానీ నా ఆలోచనలు ప్రస్తుతానికి రాలేదు.

'అప్పుడే వచ్చేశామా' అంటూ బస్ దిగి పరిసరాలని పరికించసాగాను.

'అదిగో అలా చూడూ అధివుప్పరి చెరువు' మధు అలా అనేసరికి నాకు చెడ్డ కోపం వచ్చింది.

'అరేయ్ ఈ వూర్లో పుట్టి ఇరవై యేళ్ళు పెరిగిన నాకు నువ్వు చెప్తున్నవా! నేను చెప్తాను విను. ఇది ఉప్పరి చెరువు. యింకా ముందుకు వెళ్ళి యెడంపక్కకి కాస్తదూరం నడిస్తే చాకలి చెరువు. బ్రాహ్మల బజారు వైపుగా వెడితే నాగుల చెరువు. ఆ చెరువులో స్నానాలు చేస్తూ ఈతలు కొడుతూ యెంత సరదాగా గడిపానో చిన్నప్పుడు.'

వూపిరి సలపకుండా మాట్లాడేస్తూన్న నన్నుచూసి ఆశ్చర్యంగా 'అత్తా అవన్నీ నీకింకా గుర్తున్నాయా' అన్నాడు.

నాకు కోపం వచ్చేసింది.

'కన్నతల్లినీ పుట్టిన వూరినీ మరిచిపోతారురా! ఎవరన్నా?' అన్నాను

'నాలుగేళ్ళు అమెరికాలో వుండివచ్చిన మామామయ్య తెలుగు మాట్లాడటం మరచి పోయానన్నాడు.'

'యే మామయ్య! సుధాకరమామేనా! ఈ వూళ్ళోనే వున్నడా. చెప్పు బూజు దులుపుతాను అన్నాను వచ్చే కోపాన్ని నిగ్రహించుకుంటూ.

'ఆయన అదృష్టం బాగుంది. నిన్ననే పీలేరు వెళ్ళిపోయాడు'.

మధు నవ్వుతూ అంటూండగానే ఇల్లు రానే వచ్చేసింది.

తమ్ముడూ మరదలూ ఎదురుగా వచ్చారు.

'అక్కా బావగారు రాలేదేం' అన్న కుశల ప్రశ్నలే షరా మామూలూ కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళగానే మరదలు గ్లాసుడు చిక్కటి కాఫీ యివ్వటం స్నానం వగైరా తర్వాత నేను కలకత్తానుంచి తీసుకు వచ్చిన బెంగాల్ కాటన్ చీరె రసగుల్లాలూ యిస్తుంటూ మరదలు ముఖం మతాబులా వెలగటం తమ్ముడు ఆమెని ఆట

పట్టించటం నేను నవ్వటం అంతలోనే నాలోనేను యిలా నవ్వి యెన్ని సంవత్సరాలైందీ అనుకోవటం తమ్ముడు కబుర్లు చెప్పటంతో కాలం ఇట్టే గడిచిపోయింది ఆరోజు.

మరునాడు స్నానం టిఫెన్ వగైరా అయిన తర్వాత వూళ్ళో కబుర్లు చెప్తూ హటాత్తుగా ఆ మాటలు ఆపి అన్నాడు.

'అక్కా బాపిరాజు తాతయ్య గుర్తువున్నాడా' అని

'ఆ.... గుర్తు వున్నాడుగానీ ఆయనింకా బ్రతికే వున్నాడా?'

'బ్రతికి వుండటమేకాదు. నిన్ను గురించి యెప్పుడూ అడుగుతూంటాడు'

'ఔనా' బాపిరాజు తాతయ్య గుర్తుకు వచ్చే సరికి ఫక్కున నవ్వు వచ్చింది. దానితో బాటు బాల్య స్మృతులూ, కళ్ళ ముందు కదలసాగాయి.

నాకు యేడెనిమిదేళ్ళ వయసప్పుడు యెండాకాలం శలవుల్లో తోటి అమ్మాయిలతో కల్సి వేణుగోపాలస్వామి గుళ్లో బొమ్మల పెళ్లిచేసి ఆటలు ఆడేవాళ్ళం గన్నేరు పూలు కోసి దండలు కట్టి తాటాకు బొమ్మలకి చీరెలూ జాకెట్లూవేసి బొమ్మల పెళ్ళి చేయటంలో మాకు కాలం తెలిసేదికాదు.

ఒళ్ళంతా తామరతో బరబరా గోక్కుంటూ గుమ్మడికాయంత బొజ్జతో బాపిరాజు తాతయ్య కూడా మా ఆటల్లో ఆసక్తిగా పాల్గొనటానికి వచ్చినప్పుడు గజ్జి కాకరకాయి పోపో అంటూ పిల్లలం అరిచేవాళ్ళం. అయితే అలా అందరూ ఆయన్ని ఆటలు పట్టించటం అలవాటు వున్నందువల్లనోయేమో ఆయన బాధపడకుండా మా బొమ్మల పెళ్ళి అయిన తర్వాత విందు భోజనానికి వడ్డించేందుకంటూ బటానీలూ, జీడీలు, వేరుసెనగ పప్పులూ, ఖర్జూరపు పండూ ఇలా రోజుకోరకం వుత్తరీయం కొంగున మూట కట్టుకుని వచ్చే తాతయ్యని ఆటల్లో చేర్చుకునేవాళ్ళం. ఒక్కోసారి పెళ్ళి కొడుకు బొమ్మసరిగా కుదరకపోతే తనే పెళ్ళి కొడుకులా కూర్చుంటాననేవాడు. అలాంటప్పుడు నేను ఆయనని పెళ్ళికొడుకు ముస్తాబు చేస్తూండేదాన్ని. ముఖాన నిలువు బొట్టూ బుగ్గన చుక్కా కాళ్ళకి పసుపు పారాణీ పెట్టేదాన్ని. ఆయన ఆముస్తాబుతో బొమ్మపెళ్ళి కుతూరికి మంగళసూత్రం కట్టి మా అందరితోబాటు ఆనందాన్ని పంచుకునేవాడు. ఆయనకి ఒక చెడ్డ అలవాటు వుండేది. ప్రతి చిన్న పనికీ మనవరాలు పెళ్ళామా' అంటూ హాస్యమాడినప్పుడు. స్నేహితురాళ్ళు సుబ్బులు, అన్నపూర్ణ, సుందరీ 'తాతయ్య మొగుడుగారూ వీపుగోకమంటారా' అంటూ జవాబిచ్చేవాళ్ళు. కానీ నాకు మాత్రం చెడ్డకోపం వచ్చేది. అంతే దగ్గర యేదివుంటే దాన్నితీసుకుని విసిరి కొట్టేదాన్ని అలా ఓసారి

చిన్నరాయితో కొట్టినప్పుడు ఆయన ముఖానికి తగిలి బొప్పి కట్టింది. ఆయన బాధతో 'అబ్బా' అని నుదురు పట్టుకుని బాధపడుతూంటే భయంవేసి దగ్గరకు వెళ్ళి చేత్తో రాసి 'సారీ తాతయ్యా...' అన్నాను. నేను అలా అనేసరికి ఆయన బాధ యెగిరిపోయింది. 'ధరణీ! బంగారు తల్లీ' అంటూ నా చేతిని ఆత్మీయంగా తనచేతిలోకి తీసుకున్నపుడు నా మనసు సంతోషంతో పులకించేది.

'బంగారు తాతయ్యా! బహుమంచి తాతయ్యా' అంటూ పాట పాడుతూంటే ఆయన కళ్ళలో కన్పించిన ఆనందం యిప్పటికీ గుర్తు వస్తూనే వుంటుంది.

'ధరణీ ఒక్క ముద్దు యివ్వవే' అన్నాడు నా స్నేహితులు అందరూ ఆయన కీ ముద్దు యిచ్చారు. కానీ నే 'చస్తే ముద్దు యివ్వను నీకు' అన్నాను. కోపంతో మండిపడుతూ. మరేంయిస్తావ్' అన్నాడు రాజీకీ వస్తూ. మరేదైనా కోరుకో' అన్నాను గర్వంగా ఆయన ఓ క్షణం ఆలోచించాడు. ఆ తర్వాత అన్నాడు

'నువ్వు పెద్ద దానివి అయిన తరువాత నాకు ముత్యపు గుండీలు కొనిపెట్టు'

'ఓ అలాగే' అనేసి ఆట పూర్తిచేసి అందరినీ కూర్చోమని బాదమాకులు పరిచి యివిగో పిండివంటలు అంటూ రకరకాల పేర్లుచెప్తూ బటానీలు ఈతపళ్ళు వడ్డించి పొద్దుకూకే సమయానికి ఆట ఆపేసి ఇళ్ళకి పరుగులు తీసేవాళ్ళం. ఇలా రోజూ మా ఆటలుసాగిపోతూ వుండేది. ఒక రోజున తాతయ్య మా ఆటలో పాల్గొని ముఖాన పెళ్ళి కొడుకు బొట్టూ బుగ్గన చుక్కా చెరిపేసుకోవటం మరిచిపోయి ఇంటికి నడిచి వెడుతూన్న ఆయన్ని కన్పించిన ప్రతివాళ్ళూ ఆయన అలంకరణకి తెల్లబోయి చూసి తర్వాత నవ్వుకుని తర్వాత ఆటలు పట్టించి ఏడిపిస్తూ వెంటపడటం చూసిన ఓ పెద్ద మనిషి ఆయన్ని నిలదీసి 'యేంటయ్యా బాపిరాజూ నువ్వు ఘోటిక బ్రహ్మచారివై వుండీ యిదేం వేషం అని నిలదీసే సరికి ఆయన తబ్బిబ్బై పడిపోయి యేం చెప్పి తప్పించుకోవాలో తెలియక 'మరీ మరే కరణంగారి కూతురు ధరణి ఆటల్లో నన్ను పెళ్ళి కొడుకు వేషం వేసి కూర్చోబెట్టి యిలా యిలా' అనటం ఆ విషయం నాన్నకి తెలియటం నన్ను దండించటంతో మా బొమ్మల పెళ్ళిళ్ళ ఆటలు ఆగిపోయాయి.

ఆ తర్వాత బస్తీకి వెళ్ళటం హైస్కూలు కాలేజీ చదువూ డిగ్రీకి వస్తూనే పెళ్ళి ప్రయత్నాలూ పెళ్ళీ కలకత్తా కాపురం వగైరా తర్వాత నాన్న అమ్మా పోవడం పుట్టింటి రాక పోకలు తగ్గి పోవటం చాలా వేగంగా కాలం దొర్లి పోయింది అనిపిస్తూ వుంటుంది.

చాలా సంవత్సరాల తర్వాత పుట్టిన వూరికి రావటంతో బాల్యస్మృతుల్లోంచి బైటపడి చిన్నగా నవ్వాను.

"తాతయ్య అడిగిన ముత్యపు గుండీలు తెచ్చవా ఈ సారన్నా"

ఈ విషయం నాకే గుర్తు లేదు. నీకెలా తెలుసురా? ఆశ్చర్యంగా అన్నాను.

"తాతయ్య కిప్పుడు తొంబై ఏడు యేళ్ళు. మంచంలోనుంచి లేవటం లేదు. నన్ను చూడాలని వుంది అని కబురు పంపిస్తే వెళ్ళాను. అప్పుడు నీ క్షేమం అడిగి ఈ విషయం చెప్పాడు"

"ఈ విషయం ఆయనకి యింకా గుర్తువుందా! చప్పున లేచి కూర్చుని అడిగాను.

"ఉందట్నా"

నాకు చీకాకు వేసింది. చిన్నప్పుడు ప్రతి ఆడపిల్లనీ మనవరాలు పెళ్ళామాఅనే వెధవ వరస పెట్టి పిలవటమే కాక అప్పుడెప్పుడో "కొనిస్తానులే" అన్నమాట పట్టుకుని యిప్పటికీ కలవరించటం ఒళ్ళుమండేలా చేసింది. అంతే మౌనంగా వుండిపోయాను.

సాయంకాలం అయిదు గంటలూ కావస్తూండగా మధుని తోడిచ్చి వెళ్ళి తాతయ్యని చూసిరా అక్కా" అంటూ బలవంతపెట్టాడు తమ్ముడు.

లోలోపల విసుగ్గా వున్నా తప్పని సరికి బయలు దేరాను.

తమ్ముడు చేబులో నించి ఓ చిన్న పొట్లం తీసి యిచ్చాడు.

"ఏమిటిది? అంటూ విప్పి చూశాను. ముత్యపు గుండీలు.

"ఏమిటిరా! నీక్కూడా చాదస్తమా!" అన్నాను చికాకుగా.

"పల్లెటూరి మమతలూ మమకారాలూ నువ్వు బొత్తిగా మరిచిపోయావక్కా

తాతయ్య నువ్వు ముత్యాను గుండీలు తెచ్చి యిస్తావని ఆయన షర్టుకి గుండీలు పెట్టుకోకుండానే తిరిగేవాడు సంవత్సరాల తరబడి"

"నిజమా?"

"ఔను. యెంత కాదన్నా ఆయనని గురించి నీకేం తెలియదు. ఆయన వంటిమీద వున్న తామరని చూసి అందరూ ఆటలు పట్టించేవాళ్ళు. హేళన చేసే వాళ్ళు. అది భరించలేకే ఆయన వాళ్ళందరికీ దూరంగా వుంటూ పిల్లలతో కల్సి ఆడీ పాడీ సంతోషపడేవాడు. ఆ సంతోషం కూడా ఆయనకి ఎన్నాళ్ళో నిలవలేదు. ఈ మధ్య పెరుగుతున్న పిల్లలకి బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తూ ఆటలాడే సావకాశం ఇంట్రెస్టూ

యెక్కడుందక్కా. పల్లెలో కూడా కాన్వెంట్ స్కూళ్ళు యూనీఫారాలూ హోం వర్కులతో పిల్లలు పసిమనసులను పోగొట్టుకుని గిడసబారిపోతున్నారు. తాతయ్య మాత్రం ఆయనకి ఓపిక వున్నంత వరకూ నడవలేక పోయినా కర్ర పట్టుకుని అతి ప్రయాసతో అడుగులు వేస్తూ వేణుగోపాలస్వామి వారి దేవాలయం వరకూ వచ్చి మీరు ఆటలాడే స్థలంలో పిచ్చివాడిలా ఆకాశంలోకి చూస్తూ కూర్చుని చీకటి పడిన తర్వాత మెల్లగా నడుచుకుంటూ వెళ్ళి పోతాడు ఇంటికి. ఈ మధ్య ఆ శక్తీ లేకుండా పోయింది పాపం.

"నా మనస్సులో పేరుకుంటున్న చికాకు యెగిరి పోయింది. జాలి ముందుకు వచ్చింది.

"మధూ రారా!" అంటూ తాతయ్య ఇంటికి బయలు దేరాను"

★ ★ ★

సంధ్యా సమయం కావస్తూంది. పావుగంట. నడిస్తే కాని తాతయ్య ఇల్లు రాదు. తాతయ్య ఇల్లు రెండు మార్లు చూసిన గుర్తు. పెంకుటిల్లూ చుట్టు తడికెలూ అతి సామాన్యులు వాళ్ళు. మధు వాకిలి తడిక తీసి పట్టుకుని

'అత్తా రా లోపలికి" అన్నాడు.

తడిక చప్పుడుకి "యెవరూ? అంటూ వచ్చింది. నాంచారమ్మ.

నాంచారమ్మ అంటే బాపిరాజు తాతయ్య తమ్ముడి పెళ్లాం.

"ధరణీ నువ్వా! ఎప్పుడొచ్చావమ్మా! రాలోపలికి- కలకత్తాలో వుంటున్నావుట కదూ" అంటూ సంతోషంతో యెదురు వచ్చి చెయ్యి పట్టుకుని లోపలికి రండని తీసుకు వెళ్ళింది. తాతయ్య మంచం దగ్గర ఓ స్టూలు లాగి కూర్చోమంది.

'యెవరూ?" గడ్డం పెరిగి ఒళ్ళంతా నీరుపట్టి చూడటానికి భయం గొలిపేలా వున్న తాతయ్య గొంతు హీనస్వరంగా పల్కింది.

"ధరణి ధరణి వచ్చింది కలకత్తా నించి" పెద్దగా అరిచి చెప్పింది నాంచారమ్మ.

ఆయన కళ్ళు మెల్లగా విప్పాడునాంచారమ్మ నేను ఆయనకి కన్పించేట్టు లాంతరు ఎత్తి పట్టుకుంది.

"అమ్మా.. ధరణీ! తల్లీ ఒచ్చావా" ఆయన శక్తినంతా కూడదీసుకుంటూ అన్నాడు.

"నిన్ననే వచ్చాను తాతయ్యా" అన్నా మృధువుగా.

"ముత్యపు గుండీలు తెచ్చావా"?

"తెచ్చాను తాతయ్యా" అంటూ అందివ్వవ బోయాను.

"షర్టుకి ఆ గుండీలు పెట్టమ్మా! తల్లివి కదూ!

ఆ అభ్యర్థనకి నా మనసు కదిలిపోయింది. మెల్లగా గుండీలు పెట్టాను.

ఆయన కళ్ళలో ఆనందం చూస్తుంటే యేదో తెలియని ఆత్మీయ భావాన్ని అర్థం చేసుకోగలిగానన్న సంతృప్తి నా మనసునిండా ఆక్రమించింది. కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"అమ్మా ధరణీ యెప్పటికైనా నువ్వు ఒక్కసారి వచ్చి ఈతాతయ్యని చూస్తావనీ అప్పుడు నీకివి యివ్వాలనీ ఈ బొమ్మలని దాచానమ్మా. తాటాకు బొమ్మలయితే చిరిగి పోతాయని కొయ్య బొమ్మలు కొని పెళ్ళి కూతురూ, పెళ్ళి కొడుకు అలంకరణ నేనే చేసి నీ కోసం దాచి వుంచాను. యివిగో తీసుకో అంటూ యెంతో ప్రయాసతో కాస్త లేచి తల కింద వున్న దిండుని యెత్తి వాటిని తీసి నాకిస్తూ.

'ధరణీ! మీ బొమ్మల పెళ్ళిళ్ళలోకి నేను రావటం నీకు ఇష్టం వుండేది కాదని నాకు తెల్సునమ్మా. పెళ్ళాం బిడ్డలు లేని నేను ఒంటరిపక్షినే కాదు శాపగ్రస్తుడిని, తామరతో నిండిన శరీరాన్ని మోయలేక మోస్తూ మీ పిల్లల ఆటల్లో శాంతినీ సంతోషాన్ని పొందేవాడినమ్మా. కేవలం ఈ విషయం కోసమే మీ ఆటల్లో చేరే వాడిని. ఈ విషయం గ్రహించటానికి మీ కప్పుడు వయసు చాలదని నాకు తెల్సు. అందుకే నువ్వు కోపగించుకన్నా నేను బాధపడే వాడిని కాను. పైగా పిల్లలంటే నాకు తగని యిష్టం. ఆనాటి సంతోషమే నన్నిన్నాళ్ళు బ్రతికించిందమ్మా. అంత సంతోషం మీరునాకిచ్చినందుకు మీకు చాలా ఋణపడి వున్నాను."

తాతయ్య ఆయాసంతో యింక మాట్లాడలేక ఆగిపోయాడు."

"ఈబొమ్మలు నేనేం చేసుకోను" ఆయన చేతిలో నించి అందుకుంటూ అన్నాను.

నీ పిల్లలకి యివ్వమ్మా అంటూ షర్టు గుండీలని తృప్తిగా చేత్తో తడుముకుంటూ కళ్ళు మూసుకుని పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు తాతయ్య. "ధరణీ చాలా రోజుల తర్వాత ఈ కాస్సేపు నీతో మాట్లాడాడు ఆయన. యింక కళ్ళు తెరవడు" అంటూ వెక్కి వెక్కి యేడవ సాగింది నాంచారమ్మ.

"నువ్వు యెందుకు యేడుస్తున్నావ్?" అన్నాను.

"ఆయన ఘోటక బ్రహ్మచ్చారిగా మిగిలిపోవటానికి కారణం నేను ధరణీ" అంది.

"నువ్వా?"

"అవును. నేనే. బాపిరాజు గారూశ్రీనివాసరావూ యిద్దరూ అన్నదమ్ములుఅని నీకు తెల్సుగా ధరణీ. తల్లిదండ్రులు కూడా వీళ్ళ చిన్నప్పుడే చచ్చిపోతే ఈ బాపిరాజుగారుతమ్ముడిని ప్రాణంగా చూసుకుని పెంచి పెద్ద చేశాడు. చదువు చెప్పించాలని చూసినా శ్రీనివాసుకి చదువు రాలేదు. వున్నరెండెకరాల పొలం వ్యవసాయం చేసుకుంటూ ఇంటి ఖాళీ స్థలంలో కూరగాయలు పండించుకుని బ్రతికారు అన్నదమ్ములు. వీళ్ళు మా నాన్నకి దూరం చుట్టాలు. వీళ్ళు అమాయకులని నన్ను బాపిరాజుకిచ్చి పెళ్ళిచేసి ఈ ఆస్తిని ఆయన చేజిక్కించుకోవాలని కుట్రపన్ని నాకు పెళ్ళి ప్రయత్నంచేశాడు. నాకు బాపిరాజు గారంటే ఇష్టం లేక అది చెప్పినా మానాన్న వినక నేను చెరువులో దూకాను. కళ్ళు తుడుచు కుంటూ చెప్పసాగింది. యాభై యేళ్ళుపైబడ్డ నాంచారమ్మ.

"నాకీ విషయాలు తెలియవే తర్వాత" అన్నాను.

"నేను చావకుండా యెవరో రక్షించారు. కానీ ఈ విషయం బాపిరాజు గారికితెల్సి ఆయన స్వయంగా వచ్చి నన్ను కల్సి అడిగారు. కారణం యేమిటి" అని

"మీరంటే నాకిష్టం లేదు. మీ తమ్ముడినైతే చేసుకుంటాను అన్నాను" అంతే. ఆమన మా పెళ్ళిజరిపించేశారు. నన్ను కన్న బిడ్డలా చూశారు. ఈ నాటికీ ఆయన మంచితనం నాకు నచ్చి ఆయన్ని తండ్రిలానే చూసుకుంటున్నాను. మానాన్న పాచిక పారకుండా దూరంగా తరిమి కొట్టాను. ఈయనకి పిల్లలంటే యిష్టం అని నాకు తెల్సు..

ఇద్దరు పిల్లలని కని ఆయనకి కాలక్షేపం చేయించాలని యెందరు దేవుళ్ళకో మొక్కాను. కానీ ధరణీ నాకు పిల్లలు కలగలేదు. ఇంట్లో సందడి లేకే ఆయన మీ ఆటల్లో చేరేవారు. ధరణీ నువ్వు వచ్చి ఆయన్ని చూడటం ఆయనకు యెంత సంతోషాన్ని కల్గించిందో చూశావుగామ్మా? ఆయన జీవితం ముగియటానికి యెన్నాళ్ళో వ్యవధి లేదమ్మా అందుకే ఆయనకి సేవ చేసి రుణం తీర్చు కుంటున్నాను" నాంచారమ్మ కళ్ళు ఒత్తుకుంటూ అంది.

చదువు సంధ్యా లేని నాంచారమ్మలోని మానవతా దృక్పధం నన్ను ఆశ్చర్యంలో ముంచింది. నా చదువూ సోషల్ లైఫూ యెందరెందరో నాగరీకుల పరిచయలూ, వారి అంతరంగాలని చదివేయగలనన్న గర్వం కేవలం తాతయ్య శరీరం మీద వికారంగా

కన్పించే తామరని చూసి అసహ్యపడ్డానే గానీ ఆయనలోని మానవీయతని గ్రహించలేనందుకు సిగ్గు కల్గింది.

నాంచారమ్మ చేతులు రెండూ పట్టుకుని దగ్గరగా తీసుకున్నాను.

ఆవిడ నా గుండె దగ్గర ఒక్క క్షణం సేదదీరినట్లు వుండిపోయింది.

అంతలోనే తేరుకుని "ధరణీ రాక రాక మా ఇంటికి వచ్చావు. ఉండమ్మా 'టీ' చేసి యిస్తాను." అంది నన్ను వదిలి వంటగది వైపూ నడుస్తూ.

'ఒద్దు ఒద్దు యిప్పుడే తాగి వచ్చాను. వెళ్ళి వస్తాను. తాతయ్యని జాగ్రత్తగా చూసుకో" అన్నాను. ఆవిడ ముఖాన వున్న రూపాయంత కుంకుమబొట్టు వైపుచూస్తూ.

"పోనీ బొట్టు పెడతాను వుండు. సమయానికి ఇంట్లోపళ్ళు కూడా యేమీ లేవు" అంటూ ఓ యెర్ర ముద్ద మందారపువ్వు రెండు నిమ్మపళ్ళూ యిచ్చి బొట్టుపెట్టి 'ధరణీ పేదవాళ్ళం అమ్మా" బొంగురు పోయిన గొంతులో అంది.

"కాదు. మీరు పేదావాళ్ళు కానే కాదు. జీవితపు విలువలు పోగొట్టుకోని అదృష్టవంతులు" అంటూ వాకిలి వరకూ నడుస్తూన్న నా వెంట వచ్చింది.

"వుంటాను ధరణీ" అంటున్న నాంచారమ్మ చెయ్యిపట్టుకుని ఆత్మీయంగా నొక్కి మధు వెంట వస్తూ నా చేతిలోని పెళ్ళి కూతురూ, పెళ్ళి కొడు కూ బొమ్మలని ఓసారి చూసుకుని అపురూపంగా గుండెకి హత్తుకున్నాను. ఆ స్పర్శలో బాపిరాజు తాతయ్య స్వచ్ఛమైన ప్రేమ నా మనసును తాకినట్లుగా అన్పించసాగింది. యెలా ఇల్లు చేరానో నాకే తెలియదు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)